క్లుప్తంగా

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సొంతిల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు రెండు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి కోరారు. బుధవారం అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం కర్నూలులో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. వైస్ ప్రెసిడెంట్ శాంతి భవాని, సెక్రటరీ బండారి, ఈసీ సభ్యులు శాంతిలత, సోమేశ్వరి, ఉమారాణి, కృష్ణవేణి, ఉమాదేవి పాల్గొన్నారు.

హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలి



వర్సిటీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో వర్సిటీ పురుషుల హాస్టళ్లను వీసీ తనిఖీ చేశారు. హాస్టళ్లలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలన్నారు. విద్యార్థులు తమ గదులను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, హాస్టల్ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో సహకరించాలన్నారు. వంటశాలతో పాటు, డైనింగ్ హాల్‌ను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆహారం వృథా కాకుండా చూడాలన్నారు.

చలిలో చిన్నారులను కాపాడుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): చలిలో తిరగకుండా చిన్నారులను జాగ్రత్తగా కాపాడుకోవాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. బుధవారం కర్నూలు నగరంలోని ఇందిరమ్మ హౌసెస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిర్మల్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. న్యూమోనియా నివారణకు పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. చలితీవ్రత దృష్ట్యా చిన్నారులు బయట తిరగకుండా చూడాలని, ఈ కాలంలో చిన్నారులకు జ్వరం, జలుబు, పొడి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని, చాక్లెట్లు, శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉంచాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, నాగలక్ష్మి, సత్యవతి, జయశ్రీ, ఇందిరమ్మ, హూరీన్నీసా, సుజాత పాల్గొన్నారు.

నాటక అకాడమీ చైర్మన్‌కు సన్మానం



గుమ్మడి గోపాలకృష్ణను సన్మానిస్తున్న టీజీవీ కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు కల్చరల్: నాటక అకాడమీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గుమ్మడి గోపాలకృష్ణను టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు రాజారత్నం, రాముడు, శ్రీనివాసరెడ్డి, తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు. నంది నాటక పోటీలు నిర్వహించాలని, కళాకారులకు ఉగాది పురస్కారాలు అందించాలని గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

అధి'కారులు' ఇది తగునా?

- నగరపాలకలో డీజిల్ వ్యయం తగ్గించేందుకు మూడేళ్ల క్రితం కొనుగోలు
- మూడు నెలలుగా కదలని కార్లు
- నిర్వహణను పట్టించుకోని నగర పాలక యంత్రాంగం



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో మూలకు ఉంచిన ఎలక్ట్రికల్ కార్లు

కర్నూలు (టౌన్): నగరపాలకలో అధికారుల కార్లకు అద్దెలు, నిర్వహణ తడిసి మోపెడవతుందని మూడేళ్ల క్రితం అప్పట్లో పనిచేసిన ఐఏఎస్ అధికారి, నగరపాలక కమిషనర్ డీకే బాలాజీ ఎలక్ట్రికల్ కార్లు కొనుగోలు చేశారు. ఒక్కొక్కటి రూ.11.50 లక్షలు చొప్పున 7 కార్లను తెప్పించారు. నగరపాలక కమిషనర్, అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్, డిప్యూటీ సిటీ ప్లానర్, రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి, నగరపాలక శానిటేషన్ సూపర్‌వైజర్, మున్సిపల్ ఎస్‌ఈ, మున్సిపల్ ఇంజినీర్లు ఇలా... ఉన్నత స్థాయిలోని అధికారులందరికీ కార్లు ఉన్నాయి. బాడుగ పద్ధతిలో నడుస్తున్నాయి. నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సైతం కార్ల అవశ్యకత ఉంది. అత్యవసర పనుల్లో ఉండే డీఈఈలు అందుబాటులో ఉండేందుకు వీరికి కార్లు కేటాయించారు. అయితే డీజిల్ రూపంలో అధిక భారం పడుతుందని గమనించిన కమిషనర్ బాలాజీ ఎలక్ట్రికల్ కార్లు కొనుగోలు చేశారు. నగరపాలకలో ఏర్పాటు చేసిన బ్యాటరీ రీచార్జీ చేయడం తప్పా డిజిల్ వ్యయం ఉండదు. మొత్తం 7 ఎలక్ట్రికల్ కార్లలో మూడు నెలల క్రితం రెండు ఎలక్ట్రికల్ కార్లు మూల కు పడ్డాయి. బ్యాటరీ రిపేరు అని పక్కన పెట్టేశారు. కనీసం నగరపాలకలో నిర్వహణ చేసే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్లకు మరమ్మతులు సైతం చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ కార్ల స్థానంలో బాడుగ పేరుతో సొంత కార్లు వేసుకొని దర్జాగా డీఈఈలు తిరుగుతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే కార్లను పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఖర్చు తగ్గించాలన్న గత ఐఏఎస్ అధికారి మంచి ఉద్దేశం పాలకుల వల్ల నీరు గారిపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా బ్యాటరీ మార్పు చేస్తే రోడ్డెక్కే ఎలక్ట్రికల్ కార్లను రిపేరు చేయించాలని కార్పొరేషన్ సిబ్బంది కోరుతున్నారు.

పురాణ ఇతిహాసాలను వివరించాలి



శిక్షణ పొందిన విద్యార్థులతో అతిథులు

కర్నూలు కల్చరల్: పురాణ ఇతిహాసాల గురించి విద్యార్థులకు వివరించాల్సిన అవసరం ఉందని మాతృమండలి జిల్లా అధ్యక్షురాలు జంపాల రాధిక అన్నారు. 2025 జనవరి 22 నాటికి అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో వీహెచ్‌పీ, భారత్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రైవేటు ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లలో అయోధ్య రామ మందిరం గురించి పరీక్షలు నిర్వహించారు. ఏక్యాంప్ మాంటిస్సోరి హైస్కూల్‌లో గత ఆరు వారాలుగా నిర్వహిస్తున్న రామాయణ పరీక్షల శిక్షణ బుధవారం ముగిసింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పద్మావతి సుమారు 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి, ఉపాధ్యాయులు నాగ ప్రసన్న, వీహెచ్‌పీ కర్నూలు నగర సహ ప్రముఖ్ ఈపూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల బెడద నియంత్రించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 24వ వార్డు పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, కుక్కల బెడదను నియంత్రించేందుకు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని సీపీఎం నాయకుడు వి.వెంకటేశ్వర్లు ఆరోపించారు. బుధవారం మధ్యాహ్నం 12.35 గంటలకు తాను బైక్‌పై వెళ్తుండగా వీధి కుక్కలు వెంటబడి కరవడంతో తీవ్ర గాయమైనట్లు చెప్పారు. గతంలోనూ వార్డులో వీధికుక్కల సమస్యపై మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వినోదంతో వ్యాపారమా?

కర్నూలు(సెంట్రల్): వినోదాన్ని వ్యాపారంగా మారుస్తున్న సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గురువారం విడుదల కాబోతున్న పుష్ప–2 సినిమా టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. టిక్కెట్ ధర ఏకంగా రూ.900కు పైగా ఉండడంతో హీరో అభిమానులు కూడా టిక్కెట్లు కొనలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వెంటనే జిల్లా అధికారులు కలుగజేసుకొని టిక్కెట్ల ధరలను తగ్గించాలని కోరారు. నాయకులు ప్రకాస్, విజయ్, సాయి, ఉదయ్ పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): అనుకోకుండా వచ్చే ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాల్లో తగిన ఏర్పాట్లు ఉండాలని హోంమంత్రి, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆమె బుధవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. విపత్తులను ఎదుర్కొనేందుకు స్టాండర్డ్ ఎస్‌ఓపీ రూపొందించుకునే విధానంపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను రక్షించేందుకు అవసరమైన పరికరాలను ప్రతి జిల్లాలో ఉంచే విధంగా గోదాములను గుర్తించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి.రంజిత్‌బాషా హాజరయ్యారు.

మాజీ సీఎంకు నివాళి

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య అపర చాణక్యుడని, ఆయనకు జిల్లాతో వీడదీయరాని సంబంధాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన సమయంలో అపధర్మ ముఖ్యమంత్రిగా తరువాత ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా కొనిజేటి రోశయ్య సేవలందించారని కొనియాడారు. నాయకులు వెంకటరెడ్డి, బతుకన్న, సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

'కడప ఉక్కు'పై సీఎం సమాధానం చెప్పాలి

కర్నూలు(సెంట్రల్): కడప ఉక్కు పరిశ్రమపై పార్లమెంట్‌లో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి చేసిన ప్రకటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీ విభజన చట్టం ప్రకారం వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని జనసేన ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ.. ఆ స్టీలు ప్లాంటు నిర్మాణం తమ పరిశీలనలో లేదని చెప్పడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. ఇది వెనుకబడిన రాయలసీమకు ద్రోహమని, ఎన్‌డీఏ ప్రభుత్వ మోసమని విమర్శించారు.

7న భగవద్గీత కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగర శివారులోని విజ్ఞాన పీఠంలో ఈనెల 7వ తేదీన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు కరెస్పాండెంట్, ప్రాంత సహసేవ ప్రముఖ్ పీపీ గురుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత పదో అధ్యాయంపై కంఠస్థ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఈ అధ్యాయంలోని 1 నుంచి 10 శ్లోకాలు, 6, 7 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 15 శ్లోకాలు, 8, 9 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 20 శ్లోకాల వరకు కంఠస్థం చేసి చెప్పవలసి ఉంటుందన్నారు. నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా యాజమాన్యాలు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



ఉద్యోగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలన విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన బుధవారం ఆసుపత్రి పరిపాలన విభాగంలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మినిస్టీరియల్ స్టాఫ్ పనితీరుపై ఆరా తీశారు. ఉద్యోగుల సీట్ల వద్దకు వెళ్లి వారి వివరాలను ఏఓ, అకౌంటెంట్ ద్వారా తెలుసుకున్నారు. వారు ఏ సమయంలో వస్తున్నారు, ఎఫ్‌ఆర్‌ఎస్, అటెండెన్స్ ఎలా వేస్తున్నారు అని అడిగి రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదులపై సరైన రీతిలో, నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కోర్టు కేసులు, ఇతర కేసులు ఏవైనా ఉంటే నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనివేళల్లో అందరూ అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. ఏఓ శ్రీనివాసులు, అకౌంటెంట్ లతీఫ్‌బేగ్, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

15న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లా ఫిరంగిపురంలోని డాక్టర్ పి.రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో ఈనెల 15, 16 తేదీల్లో అండర్–15 రాష్ట్రస్థా యి సబ్ జూనియర్ రగ్బీ బాల బాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009, 2010, 2011 సంవత్సరాల్లో జన్మించిన క్రీడాకారులు పోటీలకు అర్హులని వెల్లడించారు.

క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సౌకర్యాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాన్సర్ హాస్పిటల్‌లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని విమర్శించారు. విద్యుత్ అవసరాల కోసం జనరేటర్, ఆక్సిజన్ పైప్‌లైన్, ఎమర్జెన్సీ వార్డులో వెంటిలేటర్ వంటి సౌకర్యాలు లేకపోవడం, శానిటేషన్, వార్డుబాయ్, సెక్యూరిటీ గార్డులను నియమించకపోవడం వల్ల పూర్తిస్థాయిలో రోగులకు వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు కల్పించేంత వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సోమన్న, నగర కార్యదర్శి అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను ప్రపంచ దేశాలు వ్యతిరేకించాలని హిందూ పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం కర్నూలులో వివేకానంద సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు కాగడాల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, వాసురెడ్డి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్‌కు చెందిన కృష్ణదాసు ప్రభు అరెస్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. తక్షణమే ఆయన్ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హిందువులపై దాడులను అరికట్టేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అనేక సంవత్సరాలుగా ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు బుధవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పెండింగ్ జీతాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 57 మందికి ఉద్యోగాలు

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో 57 మందికి ఉద్యోగాలు వరించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస రెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ కె.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి బుధవారం ఆ కాలేజీలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలేజీకి చెందిన 57 మంది విద్యార్థులు కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఇందులో 49 మంది విద్యార్థులు కాగ్నిజెంట్ (జెన్.సీ), 8 మంది విద్యార్థులు కాగ్నిజెంట్(జెన్.నెక్ట్స్)కు ఎంపికయ్యారన్నారు. ఇప్పటివరకు ఈ ఏడాది 200 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు పొందారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కాలేజీ చైర్మెన్ పి.సుబ్బారెడ్డి అభినందించారు. ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గాన కళాసమితి బృందం

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘంటసాల చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, డాక్టర్ డబ్ల్యూ సీతారాం, డాక్టర్ శంకర్ శర్మ, ఘంటసాల గాన కళా సమితి ఉపాధ్యక్షుడు కురాడి చంద్రశేఖర్ కల్కూర హాజరై ప్రసంగించారు. తెలుగు చలన చిత్ర సంగీతానికి ఘంటసాల నూతన ఒరవడిని తెచ్చారన్నారు. వారు పాడిన భగవద్గీత ప్రపంచ ప్రసిద్ధిగాంచిందన్నారు. నవరసాలు పలికించిన మధుర గాయకులు అన్నారు. ఆయన గానం అజరామరం అన్నారు. ఘంటసాల గాంధీజీ అడుగుజాడల్లో నడిచి జైలు జీవితం సైతం గడిపారనిచ ఎప్పారు. మధురకవి ఎలమర్తి రమణయ్య ఘంటసాల పాడిన పాటలను ఆలపించారు. కళాసమితి అధ్యక్షుడు సుస్వరం వాసుదేవమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

- సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాకాల ఆర్ట్స్ ఆధ్వర్యంలో శ్రీశైలం ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఘంటసాల గానం ఔషధం అన్నారు. అనంతరం గాయనీ గాయకులు శ్రీనివాసులు, పద్మావతి, శ్రీదేవి, యశోద నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు పాల్గొన్నారు.
- కర్నూలు కళాకారుల సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి నిర్వహించారు. ఆయకార్ భవన్ సమీపంలోని ఘంటసాల విగ్రహానికి డీఎస్పీ మహబుబ్ బాషా, కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీవుల్లా, గాయకులు పార్వతయ్య, రమేష్‌బాబు, నాగేషు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చట్టరీత్యా నేరం



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఓర్వకల్లు: గంజాయి పంట సాగు చట్టరీత్యా నేరమని జిల్లా వ్యవసాయాధికారిని పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని కాల్వ, హుసేనాపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమెతోపాటు లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు, ఏడీఏ శాలురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ గంజాయి సాగు దుష్ఫలితాలను వివరించారు. రబీలో సాగు చేసిన శనగ, జొన్న పంటలకు అందజేసే బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా అన్ని బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కౌలు రైతులు తమ ధృవీకరణ పత్రాలతో రైతు సేవా సబ్బందితో బ్యాంక్ మేనేజర్లను సంప్రదించి రుణాలు పొందవచ్చన్నారు. ఏడీఏ శాలురెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, రబీలో సాగు చేసిన శనగలకు వచ్చిన తెగుళ్ల తీరు, నివారణకు వాడాల్సిన పురుగు మందులను గురించి వివరించారు. కర్నూలు ఏపీఎల్‌సీ లక్ష్మణ్, హుసేనాపురం ఏపీజీబీ మేనేజర్ శివకృష్ణ ప్రధానమంత్రి జన సురక్ష, జీవన్‌జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ముద్ర రుణాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతు సేవా సిబ్బంది గంగాధర్, భువనేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

కర్నూలు (లీగల్): ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా సత్వరంగా పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. బుధవారం సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించబడిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా, గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామ నివాసి కుమ్మరి రంగనాయకులు (వాది) ఇంటికి దక్షిణం వైపు ముళ్లపొదలు, పిచ్చి చెట్లు మొలిచి పాములు, దోమలు, పందులకు ఆవాసంగా మారింది. అంతేగాకుండా దుర్వాసన వెదజల్లుతూ మురుగునీటి వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి అనేక వ్యాధులు వ్యాపించే అవకాశమున్నందున వాది, కాలనీ ప్రజలు పలుమార్లు ఎంపీడీఓ, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ (ప్రతివాదులు)లకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై 2024 అక్టోబర్ 29న రంగనాయకులు, కాలనీ ప్రజలు ఈ సమస్యపై ప్రతివాదులకు ఫిర్యాదు చేశారు.అధికారులు స్పందించకపోగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ప్రతివాదుల నిర్లక్ష్య వైఖరి, సేవా లోపం కారణంగా వాది రంగనాయకులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. అభ్యర్థనను స్వీకరించి లోక్ అదాలత్ ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజు బాబు ఆధ్వర్యంలో ప్రతివాదులు చెత్తను, డ్రైనేజీని శుభ్రం చేయించారని, అంతేకాకుండా భవిష్యత్తులో సమస్య పునరావృతం కాదని హామీ ఇచ్చారు. దీంతో వాది కేసును ఉపసంహరించుకునేందుకు అంగీకరించారు. శాశ్వత లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కానీ లేదా తీర్పు ద్వారా కానీ కేసు పరిష్కారం జరిగితే తదుపరి అప్పీలు ఉండదని న్యాయమూర్తులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బస్సు డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కల్లూరుకు చెందిన బోయ నాగరాజు (35) జి.పుల్లయ్య కాలేజీలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ నవంబర్ 30వ తేదీన గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని సీఐటీయూ అనుబంధ స్కూలు బస్సు అసోసియేషన్ నిర్ణయించింది. విరాళాల రూపంలో రూ.55,400 సేకరించి బుధవారం నాగరాజు కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. తోటి డ్రైవరు కుటుంబాన్ని ఆదుకోవడం సంతోషంగా ఉందని స్కూలు బస్సు అసోసియేషన్ నాయకులు గోపాల్, ఎర్రమల, సిద్దయ్య అన్నారు, వారిని సీపీఎం నాయకులు సాయిబాబా, ఆర్.నరసింహులు, బి.రాధాకృష్ణ, ఎస్.మాలిక్‌బాషా అభినందించారు.